క్లుప్తంగా

బల్దియాలో బదిలీలు.. పదవీ విరమణలు



నిజామాబాద్ సిటీ: నగర మున్సిపల్ కార్పొరేషన్‌లో బదిలీలు, పదోన్నతులు, పదవీ విరమణలు గురువారం జరిగాయి. టౌన్‌ప్లానింగ్ విభాగంలో టీపీవోగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ, రెవెన్యూ విభాగంలో బిల్‌కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆనంద్ పదవీ విరమణ పొందారు. అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్ శంకర్ బదిలీ అయినట్లు సమాచారం. ఆయనను జీహెచ్ఎంసీకి బదిలీ చేశారు. ఇంకా అధికారికంగా ఉత్తర్వులు వెలువడలేదు. రెండేళ్లుగా ఎస్ శంకర్ నిజామాబాద్ బల్దియాలో అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన స్థానంలో వరంగల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రసన్నలక్ష్మి రానున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్ పదోన్నతిపై ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. వీరితోపాటు రెవెన్యూ విభాగంలో ఆర్‌వో నజీర్‌ను బదిలీచేసి ఆయన స్థానంలో ఖదీర్‌పాషాను నియమించారు. ఖదీర్ రెవెన్యూ శాఖలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరిని ఒకరి స్థానంలో మరొకరిని మార్చారు. బోధన్ మున్సిపల్ నుంచి జయకుమార్ నిజామాబాద్ కార్పొరేషన్‌కు రానున్నట్లు సమాచారం.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్‌నాగారం: వారసత్వంగా వస్తున్న తమ భూమిని కబ్జా చేసి, దాడులకు పాల్పడుతున్న రైస్ మిల్లర్స్ నేత దయానంద్ గుప్తాపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు గోపు తులసి కోరారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అత్తామామల ఆస్తి అయిన సర్వే నం 3191/అలో 32 గుంటల వ్యవసాయ భూమికి తామే సంపూర్ణ హక్కుదారులమని పేర్కొన్నారు. ఎంతో కాలం నుంచి భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని అన్నారు. న్యూహౌసింగ్ బోర్డ్ గౌతమ్‌నగర్‌కు చెందిన దయానంద్‌గుప్తా తమ భూమిని అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇదేంటని అడిగితే దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో విజయలక్ష్మి, అనిత, సుజాత, పూజ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని 35వ డివిజన్‌కు చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్ పార్టీలో గురువారం చేరారు. వీరికి అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేడు వేములపల్లి కిరణ్ వర్ధంతి సభ



నిజామాబాద్ సిటీ: పీవైఎస్ జిల్లా తొలి కన్వీనర్ కిరణ్‌కుమార్ వర్ధంతి సభను శుక్రవారం నగరంలోని కోటగల్లీలో ఉన్న ఎన్ఆర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు పీవైఎస్ నాయకులు తెలిపారు. పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో మట్కా, గుట్కాకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం కావాలని అన్నారు. సమావేశంలో నాయకులు గొంట్యాల రమేశ్, శివకుమార్, జన్నారపు రాజేశ్వర్, దేవిక, భాస్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రాలో లాస్యశ్రీ ప్రతిభ



నిజామాబాద్ రూరల్: విజయవాడలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో ప్రెసిడెన్సీ పాఠశాలకు చెందిన విద్యార్థిని లాస్యశ్రీ ప్రతిభ చూపినట్లు పాఠశాల డైరెక్టర్ నల్ల శ్రావ్య పేర్కొన్నారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన సమావేశంలో లాస్యశ్రీని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో చైర్మన్ శమంతా, హెచ్ఎం పవన్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, లక్ష్మణ్, జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఇంటిగ్రేటెడ్ మార్కెట్

- ప్రారంభానికి తొలగిన అడ్డంకులు
- అర్సపల్లిలో మేకల మండికి స్థల పరిశీలన చేసిన అధికారులు



అర్సపల్లిలో స్థలం పరిశీలిస్తున్న కమిషనర్

నిజామాబాద్ సిటీ: నగరంలోని అహ్మదీబజార్‌లో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఇటీవల అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, మున్సిపల్ ఈఈ మురళీమోహన్‌రెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. కోర్టు పరిధిలోని అంశాలను ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించిన స్థలం తమదని కొందరు హైకోర్టుకు వెళ్లారు. దీంతో చట్టపరమైన అంశాలను పరిష్కరిస్తూ మార్కెట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ స్థలం..

అహ్మదీబజార్‌లో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ స్థలంలో గతంలో మేకల విక్రయ కేంద్రంగా ఉండేది. మిర్యాల్‌కర్ కుటుంబసభ్యులు కొన్నేళ్లుగా ఈ మేకల మండిని నిర్వహిస్తున్నారు. తమకు ప్రత్యామ్నాయం చూపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీంతో అర్సపల్లిలోని సర్వేనంబర్ 249లో 30 గుంటల స్థలాన్ని పరిశీలించారు. ఉత్తర మండల ఎమ్మార్వో, ఆర్ఐలు స్థలం పరిశీలించి నివేదిక అందించారు. ఇక మేకల మండి(గోట్, షెఫర్డ్స్ మార్కెట్) అర్సపల్లికి మారనుంది. త్వరలోనే అధికారులు వారికి ఉత్తర్వులు ఇవ్వనున్నారు. దీంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రారంభానికి అడ్డంకులు తొలగిపోయాయి. 101 షెల్టర్లతో మార్కెట్ భవనం నిర్మించారు. అహ్మదీబజార్‌లోని కూరగాయలు, ఫిష్, మటన్ మార్కెట్లు రోడ్డు మీద కాక ఇకపై ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లోకి మారనుంది.

కోర్టు సమస్యలను పరిష్కరించాం

అహ్మదీబజార్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను దాదాపు రూ.5 కోట్లతో నిర్మించాం. ఇందులో 101 దుకాణాలు ఉన్నాయి. ఇప్పటివరకు ఉన్న కోర్టు సమస్యలను పరిష్కరించాం. మేకల విక్రయదారులకు ప్రత్యామ్నాయ స్థలం చూపించాం. త్వరలోనే మార్కెట్ నగరవాసులకు అందుబాటులోకి రానుంది.

– దిలీప్‌కుమార్, కమిషనర్

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

- మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

నిజామాబాద్‌అర్బన్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా డిమాండ్ చేశారు. ధర్నా చౌక్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షకు ఆయన గురువారం మద్దతు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. దీక్షలో నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సత్యప్రకాశ్, దండు శేఖర్, కల్లెడి గంగాధర్, మహ్మద్‌రహీం, కూన గంగాధర్, బాబురావుషిండే, కార్యదర్శి పెంచాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నిజామాబాద్ సిటీ: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం ఉదయం బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం టీయూసీఐ నాయకుడు వనమాల కృష్ణ మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పారిశుధ్య కార్మికులకు రూ.26వేల వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్, గోవర్ధన్, శివకుమార్, రవికుమార్, రవికిరణ్, రజిని, సుజాత, లక్ష్మి, నాగారావు, యాదమ్మ, శాంతి కుమార్, రాము, లక్ష్మణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పనిలో పెట్టుకోవద్దు



బాలుడిని స్కూల్‌లో చేర్పిస్తున్న అధికారులు

రుద్రూర్: బడీడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని ఎస్సై సాయన్న హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆపరేషన్ స్మైల్–11 కార్యక్రమంలో భాగంగా గురువారం బాల కార్మికశాఖ ఆధ్వర్యంలో దుకాణాలను, వ్యాపార సంస్థలను పరిశీలించి పిల్లలను పనిలో పెటుకోవద్దని అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని ఓ దుకాణంలో గంగాప్రసాద్ అనే బాలుడు పని చేస్తున్నట్లు గుర్తించారు. బాలుడి తల్లిదండ్రులను పిలిపించి చైల్డ్ కమిటీ ద్వారా కౌన్సిలింగ్ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని బాలుర హైస్కూల్ హెడ్‌మాస్టర్‌కు సమస్యను వివరించి పదో తరగతిలో చేర్పించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సూపర్‌వైజర్ బానోత్ బాబు నాయక్, చరణ్‌సింగ్, మహేశ్, శివకృష్ణ, రిజ్వాన్, షౌకత్ బేగం పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

కమ్మర్‌పల్లి: సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పునను సరించి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్, ఇన్‌చార్జి వెంకటస్వామి కోరారు. గురువారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని మాదిగ, ఉప కులాల సభ్యులు ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వర్గీకరణ ప్రక్రియ త్వరగా చేపట్టి మాదిగ, మాదిగ ఉప కులాలకు న్యాయం చేయాలని కోరారు. నాయకులు పాలెపు కిశోర్‌కుమార్, మైలారం సుధాకర్, నర్సయ్య, పోడేటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'బేటీ బచావో.. బేటీ పడావో'పై అవగాహన

నిజామాబాద్ నాగారం: నగరంలోని వినాయక్‌నగర్ సెక్టార్–4 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం బేటీ బచావో.. బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా లింగ వివక్ష అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత హాజరై మాట్లాడారు. ఆడపిల్లల ప్రాముఖ్యత, ఆడపిల్లల చదువు, లింగ సమానత్వం, బాల్యవివాహాలు, ఆల్ హెల్ప్ లైన్ నంబర్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో పి. స్వప్న, పుష్ప తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి



నిజామాబాద్‌అర్బన్: భవన నిర్మాణ రంగాల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు గురువారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతిపత్రం అందజేశారు. మూడవ రోజు రిలే నిరహార దీక్షలను కార్మికులు ముగించారు. 14 రంగాల కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో కల్లెడి గంగాధర్, బాబురావు షిండే, పెంచాల వేణు, శాంతయ్య, ఎస్కే హనీఫ్, కార్మికులు పాల్గొన్నారు.

నూతన హీరో డెస్టిని ఆవిష్కరణ



నిజామాబాద్ రూరల్: నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న వెంకటేశ్వర హీరో షోరూంలో కొత్త హీరో డెస్టిని 125 సీసీ వెహికిల్‌ను నుడా చైర్మన్ కేశవేణు గురువారం ఆవిష్కరించారు. షోరూం యజమాని నల్ల మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కొత్త హీరో డెస్టిని 125 సీసీ వెహికిల్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించబడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నల్ల జయరెడ్డి, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



తెయూ(డిచ్‌పల్లి): భద్రాచలంలో ఫిబ్రవరి 4, 5వ తేదీల్లో నిర్వహించే పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయాలని జిల్లా పీడీఎస్‌యూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం నరేందర్, కర్క గణేశ్ కోరారు. గురువారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ వద్ద రాష్ట్ర జనరల్ కౌన్సిల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధిని పూర్తిగా విస్మరించాయన్నారు. రాష్ట్రంలో రూ.7,500 కోట్ల మేరకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కౌన్సిల్‌లో 'మతోన్మాద ఫాసిజం–విద్యార్థులపై దాని ప్రభావం', 'జాతీయ ఉద్యమంలో విప్లవ విద్యార్థుల పాత్ర' అనే అంశాలపై వక్తలు ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అనిల్ కుమార్, నిఖిల్, వినోద్, నాగేశ్, సునీల్, సంతోష్, ప్రసాద్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం అందజేత



సిరికొండ: మండలంలోని తూంపల్లి శివారులో ఉన్న ఎదురు కొండ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి న్యావనంది గ్రామానికి చెందిన జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు ఉమ్మాజీ నరేశ్ రూ. పదివేల నగదును గురువారం విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్ గౌడ్, బాలరాజ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



నినాదాలు చేస్తున్న నాయకులు

సిరికొండ: మండల కేంద్రంలో గురువారం ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భంగా కృతజ్ఞతతో పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్, దీపక్, సంపత్, గణేశ్, కృష్ణ, వెంకటేశ్, గంగారాం, రాజన్న, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీకి ఘన నివాళి



కాంగ్రెస్ భవన్‌లో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నుడా చైర్మన్ కేశవేణు



సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పోలీసులు

నిజామాబాద్ సిటీ/ ఖలీల్‌వాడి: నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. కాంగ్రెస్ భవన్‌లో, నుడా కార్యాలయంలో నుడా చైర్మన్ కేశవేణు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీచౌక్‌లో కాంగ్రెస్ నాయకులు మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీజీ దేశానికి చేసిన సేవలను, ఆయన త్యాగాలను స్మరించుకున్నారు. జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి బస్వారెడ్డి ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఉద్యోగులు, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్, అమీద్ అబ్దుల్ బషీర్, వనజ రాణి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మంచి పుస్తకం ఉత్తమ మిత్రుడితో సమానం



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న కవులు

నిజామాబాద్ రూరల్: ఒక మంచి పుస్తకం ఉత్తమ మిత్రుడితో సమామని మండల విద్యాశాఖాధికారి సాయిరెడ్డి అన్నారు. నగరంలోని శివాజీనగర్ రామకృష్ణ విద్యానికేతన్ పాఠశాలలో గురువారం నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా సంచార పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన ప్రముఖ కవి వీపీ చందన్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులకు పుస్తకాలు దారిదీపాలుగా నిలబతాయని అన్నారు. అనంతరం ఎంఈవో సాయిరెడ్డి, తెలుగువెలుగు సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్‌ను కవులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కవులు కాసర్ల నరేశ్, దేశ్‌ముఖ్ ప్రవీణ్‌కుమార్‌శర్మ, రామకృష్ణ విద్యానికేతన్ కరస్పాండెంట్ శ్రీనివాసచారి, యజమాన్యం శశిరేఖ, మధుసూదన్‌చారి, రాము తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది, గ్రామస్తులు

డిచ్‌పల్లి: కుష్టువ్యాధి నిర్మూలన ప్రతి ఒక్కరు కృషి చేయాలని డాక్టర్ నవత పేర్కొన్నారు. గురువారం మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని జీపీ కార్యాలయంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో కుష్టువ్యాధి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం అందరితో కుష్టువ్యాధి నివారణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి వసంతరావు, కారోబార్ భాస్కర్, ఫీల్డ్ అసిస్టెంట్ శైలజ, ఏఎన్ఎం అనంత షిబారాణి, సుజాత, ఆశావర్కర్లు నిషాంతి, సరిత, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

విద్యాసాగర్‌కు కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలి



నిజామాబాద్‌నాగారం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న గోపాలం విద్యాసాగర్‌కు కాంగ్రెస్ తరఫున టికెట్టు ఇవ్వాలని తెలంగాణ నిరుద్యోగుల యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బొంపల్లి విజయ్‌కుమార్ అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. విద్యాసాగర్‌కు నిరుద్యోగుల పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. సమావేశంలో బండారి అశోక్, వంశీ, పవన్, నరేందర్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన అగ్గి మల్లన్న జాతర

డొంకేశ్వర్: మండలంలోని జీజీ నడ్కుడలో అగ్గి మల్లన్న జాతర గురువారం ప్రారంభమైంది. ఆలయాన్ని ముస్తాబు చేసిన నిర్వాహకులు మొదటి రోజు స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కల్యాణం, ప్రత్యేక పూజలు చేశారు. ఐదు రోజుల పాటు నిర్వహించే జాతరలో శుక్రవారం గ్రామస్తులు బోనాలు తీయనున్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	83,800	వెండి(కిలో)	96,500
22 క్యారెట్స్	76,680		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	40	60
బెండకాయ	50	90	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	50	90	దోసకాయ	30	50
దొండకాయ	35	50	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	40	60	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	20	40
వంకాయ	30	50	బీట్‌రూట్	30	50
పాలకూర	10	20	కరివేపాకు	60	100
మెంతికూర	15	30	చామగడ్డ	40	80
కొత్తిమీర	10	20	గోరుచిక్కుడు	40	80
పుదీనా	40	80	చిక్కుడుకాయ	30	60
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-11.00, 1.40, 4.40, 7.25, 10.00
స్క్రీన్-2	ఏజెంట్ గై 001(తెలుగు)-11.00 4.40 మదగజరాజ(తెలుగు)-1.30 ,7.30 10.20
స్క్రీన్-3	సంహారం(తెలుగు)- 1.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)-10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	మదగజరాజ(తెలుగు)-10.10 10.45 డాకు మహారాజు (తెలుగు)-1.20 7.40 - దేవా(హిందీ)-4.25
స్క్రీన్-3	దేవా(హిందీ)-10.45 7.15 10.30 మహిష(తెలుగు)-2.00 రొమాంటిక్ లైఫ్(తెలుగు)-4.30
స్క్రీన్ -4	ఏజెంట్ గై001(తెలుగు)-11.15 స్కై ఫోర్స్(హిందీ)-1.30 10.25 మదగజరాజ(తెలుగు)-4.15 ప్రేమిస్తావా(తెలుగు)-7.25
లలితామహల్	మదగజరాజ (తెలుగు)
దేవి	డాకు మహారాజు(తెలుగు)
నటరాజ్	రాచరికం(తెలుగు)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)